క్లుప్తంగా

ఆసక్తిరేకెత్తించిన నాటక ప్రదర్శనలు



27వ మైలురాయి నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో పైడా కౌశిక్ రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం రెండు నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలకు ముఖ్య అతిథులుగా సంధ్య ఆక్వా ఎండీ కె. వీరభద్రరావు, వలస రాజ్, కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం, విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ వారిచే తొలి ప్రదర్శనగా పి.టి. మాధవ్ రచించి దర్శకత్వం వహించిన '27వ మైలురాయి' నాటకం ప్రదర్శితమైంది. రెండో నాటిక 'చిగురు మేఘం'. అమరావతి ఆర్ట్స్, గుంటూరు వారిచే ప్రదర్శించబడిన ఈ నాటిక మెడిసిన్ చదువు పూర్తయిన తర్వాత విద్యార్థి చేసే ప్రతిజ్ఞను ఇతివృత్తంగా తీసుకుంది. వైద్య వృత్తిని మనస్సాక్షిగా, మానవత్వంతో నిర్వహిస్తాననే అంశాన్ని కథగా మలిచి ప్రదర్శించగా, ఇది అందరి హృదయాలను తాకింది.

చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య



కేఆర్ఎం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడో సంరక్షణ కార్యక్రమం

మద్దిలపాలెం: విశాఖ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో సీడీపీవో ఎంపీ రమణకుమారి, ఏసీడీపీవో శ్రీలత ఆదేశాల మేరకు మద్దిలపాలెం కేఆర్ఎం కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో పోషణ పక్వాడో సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్ర టీచర్ ఆర్. సుబ్బలక్ష్మి మాట్లాడుతూ, వెయ్యి రోజుల పోషణ సంరక్షణ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, వెయ్యి రోజుల సంరక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ, కొత్తగా నమోదు చేసుకునే విధానాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని సుబ్బలక్ష్మి వెల్లడించారు.

మద్దిలపాలెం బస్‌స్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం



శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

ఎంవీపీకాలనీ: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మద్దిలపాలెం బస్‌స్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభించారు. బాబా శతజయంతి ఉత్సవాల భాగంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్ ఎస్ఎస్ నాయుడు తెలిపారు. ఎండాకాలం నేపథ్యంలో మద్దిలపాలెం బస్‌స్టాండ్ ఆవరణంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. యువత కోసం వేదపఠనం, భజన బృందాల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కూడా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిటీ కన్వీనర్ డీవీవీఎస్ రాజు పాల్గొన్నారు.

సత్యసాయి చలివేంద్రం

ఆరిలోవ: శ్రీసత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో వేసవి దాహార్తిని తీర్చడానికి పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆరిలోవ బీటీఆర్‌నగర్‌లో ఉన్న ఓంకార మందిరంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి అంబేడ్కర్ కూడలిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. మే 15 వరకు చలివేంద్రం కొనసాగుతుందని భజన మండలి కన్వీనర్ మీసాల పైడిరాజు తెలిపారు.


కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలమాంబకు జేజేలు



కరకచెట్టు పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా లాసెన్స్ బే కాలనీలో చెట్టుకు చీరలు పెట్టి పూజలు చేస్తున్న మహిళలు



బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. సోమవారం అర్ధరాత్రి తొలి పూజతో ప్రారంభమైన జాతర మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. మూడో పట్టణ పోలీసు స్టేషన్ నుంచి విశాఖ ఐ ఆసుపత్రి వరకు సందర్శకులతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. మంగళవారం ఉదయం 4.30 గంటలకు 18 మంది మహిళలు అమ్మవారికి సారె చీరను హారతులతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి చేర్చారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు భారీ సంఖ్యలో క్యూ లైన్లలో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం 6 గంటలకు 14 గ్రామాల పెద్దల సమక్షంలో మద్దివారి పెద్దింటి నుంచి చదును పట్టు మీదుగా ఘటాల ఊరేగింపుతో పుట్ట బంగారాన్ని అమ్మవారి దేవస్థానానికి తీసుకొచ్చారు. దీంతో అమ్మవారి అనుపు ఉత్సవం ఘనంగా ముగిసింది. మేయర్ హరివెంకట కుమారి కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరకచెట్టు పోలమాంబ జాతరకు పోటెత్తిన భక్తులు

ఆకట్టుకున్న వివిధ వేషధారణలు

జాతర నిర్వహణ లోపాలపై భక్తుల ఆగ్రహం

అధికారుల నిర్లక్ష్యం.. భక్తులకు తప్పని ఇక్కట్లు

జాతర నిర్వహణలో అధికారులు, పాలకవర్గం విఫలమైంది. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మవారి దర్శనం, ప్రసాదం అమ్మకాల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. భక్తులను అడ్డదిడ్డంగా అనుమతించడంతో తోపులాట జరిగింది. అలాగే నాసిరకం బియ్యంతో తయారు చేసిన పులిహోరను అమ్మకాలు జరిపారు. ఉప్పు, పులుపు లేకుండా పులిహోర ఉండడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పెదవాల్తేరు పోలమాంబ జాతర కేవలం ఆధ్యాత్మిక సందడికే పరిమితం కాలేదు. భక్తి భావంతో పాటు సాంస్కృతిక వైభవానికి వేదికగా నిలిచింది. మంగళవారం జరిగిన జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పులివేషాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒళ్లంతా రంగులు పులుముకుని, పులి గర్జనలు చేస్తూ యువకులు చేసిన నృత్యాలు ఉత్సాహాన్ని నింపాయి. విశేష ప్రాచుర్యం పొందిన 'కాంతారా' సినిమాలోని నృత్య రీతులను పోలిన ప్రదర్శనలు కూడా జాతరలో సందడి చేశాయి. కాంతారా నృత్యంలోని ప్రత్యేకమైన హావభావాలు, లయబద్ధమైన కదలికలు చూపరులను కట్టిపడేశాయి.



భక్తులకు తాగునీరు అందిస్తూ...



పులివేషధారణలో కళాకారుల సందడి





కళాకారుల సందడి

అంబరాన్నంటిన పోలమాంబ సంబరం



అమ్మవారిని దర్శించుకున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

ఆరిలోవ: ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో పోలమాంబ అమ్మవారి పండగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ప్రాంతంలోని పలు చోట్ల అమ్మవారి పండుగను నిర్వహించడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధిలోని సంజయ్‌గాంధీ కాలనీ, పన్నెండో వార్డు పరిధిలోని పెదగదిలి, చినగదిలి, సూర్యతేజానగర్, అలాగే పదమూడో వార్డు పరిధిలోని ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్, దీన్‌దయాల్‌పురంలో కొలువై ఉన్న పోలమాంబ అమ్మవారి ఆలయాలను నిర్వాహకులు పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆయా ప్రాంతాల ప్రజలు తమ గ్రామ దేవత అయిన పోలమాంబ పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. మేయర్ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తన కుటుంబ సభ్యులతో కలిసి పెదగదిలిలోని పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే విశాలాక్షినగర్ ప్రాంతం కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో వెలసిన పోలమాంబ పండగ మంగళవారం పోలీసులు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ అమ్మవారిని ఏఆర్ పోలీస్ కుటుంబాలతో పాటు ఎస్టీకాలనీ, హనుమంతవాక, విశాలాక్షినగర్ ప్రాంతల ప్రజలు దర్శించుకొని పూజలు చేశారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆయనతో పాటు ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, పలువురు ఇన్‌స్పెక్టర్లు పూజల్లో పాల్గొన్నారు.



కైలాసగిరి పోలీస్ మైదాన ఆవరణలో పోలమాంబకు పూజలు చేస్తున్న అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా

విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పలు ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో సంఘం ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ దేశంలోని నిమ్నజాతుల కోసం అంబేడ్కర్ చేసిన కృషిని, దేశంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించే దిశగా ఆయన రచించిన రాజ్యాంగాన్ని కొనియాడారు. అంబేడ్కర్ స్ఫూర్తితో సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బాకా సత్యారావు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోగారావుకు సాహిత్య రత్నాకర బిరుదు

మద్దిలపాలెం: విశాఖకు చెందిన సీనియర్ పాత్రికేయులు, రచయిత అయలసోమయాజుల జోగారావును హైదరాబాద్‌కు చెందిన రామ దూత సాహితీ కళాసేవ సంస్థ 'సాహిత్య రత్నాకర' బిరుదుతో ఘనంగా సత్కరించింది. సంస్థ నిర్వహించిన కవితల పోటీల్లో 42 కవితలు రాసినందుకు ఆయనకు ఈ పురస్కారం లభించింది. జోగారావు ఇదివరకు పలు పుస్తకాలు, నృత్య రూపకాలు, నాటికలు రచించారు. హైదరాబాద్‌లో జరిగిన సంస్థ ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమంలో డాక్టర్ అక్షరదూత రామ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జోగారావును సత్కరించారు. వీరితో పాటు బీవీకే కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ పిళ్లా వేంకట రమణ మూర్తి (సాహిత్య భాస్కర), అయలసోమయాజుల ప్రసాద్ (సాహిత్య విభూషణ), ప్రముఖ న్యాయవాది-కవి మరువాడ భానోజీరావు (సాహిత్య భాస్కర), గౌరిపతి శాస్త్రి (సాహిత్య భాస్కర), రాంబిల్లి పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కాదంబరి క్రిష్ణ ప్రసాద్ (సాహితీ సేవా భూషణ) పురస్కారాలు అందుకున్నా వారిలో వున్నారు.



జోగారావును సత్కరిస్తున్న రామదూత సాహితీ కళాసేవా సంస్థ ప్రతినిధుల

ఉమ్మడి పీజీ సెట్‌ను తక్షణమే రద్దు చేయాలి



రిజిస్ట్రార్‌కు సదస్సు కరపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

విశాఖ విద్య: ఉమ్మడి పీజీ సెట్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయ రావుకు వినతి పత్రం అందజేశారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉమ్మడి పీజీ సెట్‌ను రద్దు చేయాలని, ప్రైవేట్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని నాగరాజు కోరారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన అన్నారు.దేశంలో అమలవుతున్న విద్యా వ్యతిరేక విధానాలు, రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 26, 27, 28 తేదీల్లో కడప జిల్లాలో విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏయూ అధ్యక్షుడు నెహేమియ, కార్యదర్శి జెట్టి అభిషేక్, ఉపాధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

పగలే వెలుగులు విరజిమ్ముతూ..

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఉన్న బస్ స్టాప్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారాయి. రాత్రి వేళల్లో వెలగాల్సిన ఈ దీపాలు మంగళవారం మధ్యాహ్నం సైతం వెలుగుతూ కనిపించాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఇక్కడ ఉన్న కొన్ని విద్యుత్ దీపాలు రాత్రి సమయాల్లో అసలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు వాటిని పట్టించుకుని మరమ్మతులు చేయడం లేదు. మరోవైపు, పగటి వేళల్లో మరి కొన్ని అనవసరంగా వెలుగుతూ విద్యుత్ వృథాకు కారణమవుతున్నాయి. ఈ విషయంపై జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ వృథాను అరికట్టడంతో పాటు, రాత్రి వేళల్లో వెలగని దీపాలను బాగు చేయించి ప్రజలకు వెలుతురు అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



బస్ స్టాప్‌వద్ద పగటి పూట వెలుగుతున్న దీపాలు

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ఎంవీపీకాలనీ: మద్దిలపాలెం చైతన్యనగర్‌లో వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ జరిగిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం సాయంత్రం ఇల్లు అద్దెకు కావాలని చెప్పి ఒక వ్యక్తి చైతన్యనగర్‌కు చెందిన వృద్ధురాలిని కలిశాడు. మంగళవారం తిరిగి వచ్చి ఇల్లు చూపించాలని కోరగా ఆమె అతడిని లోపలికి తీసుకెళ్లింది. ఆ సమయంలో ఆ వ్యక్తి ఆమెను బలంగా తోసేసి, మెడలో ఉన్న ఎనిమిది తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. ఈ ఘటనలో వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. ఆమె ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

శివాజీపాలెం గొలుసు చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ఇదిలా ఉండగా, ఇటీవల శివాజీపాలెంలో మహిళ మెడలో గొలుసు లాక్కొని పారిపోయిన ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా వారిని గుర్తించిన పోలీసులు, వారు ఒక లాడ్జీలో దిగినట్లు గుర్తించారు. అక్కడ వారు ఫోన్‌పే ద్వారా చేసిన నగదు చెల్లింపుల ఆధారంగా విజయవాడలో వారిని పట్టుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.



పుచ్చకాయపై పక్షి



పచ్చిమిర్చితో చేసిన పుష్పగుచ్ఛం



ఆనపకాయతో కొంగ



బీట్ రూట్‌తో చేసిన గులాబీ బుట్ట



వంకాయలతో కొంగ

పచ్చిమిర్చితో పువ్వులు, బీట్‌రూట్‌తో గులాబీలు

నగరంలో జరిగిన ఓ వివాహ వేడుక అబ్బురపరిచే కళాఖండాలకు వేదికైంది. అక్కడ ఆహార పదార్థాలు కేవలం కడుపు నింపేందుకు మాత్రమే కాకుండా, కనువిందు చేసే కళాకృతులుగా దర్శనమిచ్చాయి. పచ్చిమిర్చి మెరుపులతో విరబూసిన పువ్వులు, బీట్‌రూట్ ఎరుపుదనంతో రూపుదిద్దుకున్న గులాబీలు, ఆనపకాయలతో సొగసైన కొంగలు... ఇలా విభిన్న కూరగాయలు కళాకారుల చేతుల్లో జీవం పోసుకున్నాయి. ఈ 'ఫుడ్ కార్వింగ్' అనే కళారూపం.. ప్రత్యేక సందర్భాల్లో అతిథులకు ఏర్పాటు చేసే విందులలో ఆహార పదార్థాలను అందంగా మలిచి అలంకరిస్తారు. వివాహ వేడుకలో క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగిలతో చేసిన రంగురంగుల ఫ్లవర్ బొకేలు, గుమ్మడికాయతో రూపొందించిన ఆకర్షణీయమైన ఫ్లవర్ వాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతేకాదు, పుచ్చకాయపై తీర్చిదిద్దిన పక్షుల నృత్యం, ఆనపకాయ, వంకాయలతో సృష్టించిన కొంగల శోభ చూపరులను మంత్రముగ్ధులను చేసింది.

– ఏయూక్యాంపస్